విశాఖపట్నం
సోమవారం 5 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 234 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## బీపీసీఎల్ ప్రాజెక్టుకు ఓకే..!

2



## అది ఆగ్రహం కాదు.. ఉత్సాహం

### కాంగ్రెస్ సీనియర్ నేత జై రామ్ రమేశ్ వివాదస్పద ట్వీట్

### నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని ప్రజలు అడ్డుకున్నారన్న జైరాం

### తీవ్రంగా మండిపడిన సీఎం చంద్రబాబు, మంత్రి ల్లోకేశ్

### నిజానిజాలు తెలుసుకోవాలంటూ ఇద్దరూ వార్నింగ్

(అమరావతి - జయజయహే)

మదనపల్లెలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన సందర్భంగా జరిగిన బహిరంగ సభపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ట్వీట్ తీవ్ర దుమారానికి దారితీసింది. ఒక వీడియోను రీట్వీట్ చేస్తూ.. “ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో కేంద్ర ఆర్థిక మంత్రి స్వయంగా చూశారు. ప్రజలను నిశబ్దంగా ఉంచేందుకు సీఎం స్వయంగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది” అంటూ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జైరాం రమేశ్ చేసిన ట్వీట్ వాస్తవాలకు పూర్తి విరుద్ధమని సీఎం చంద్రబాబు నాయుడు

# ప్రతీ కుటుంబానికి సొంతిల్లు

### 2029 నాటికి సాకారం చేస్తాం

### రాష్ట్రమంతటా త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇల్లు

### బుర్రిపాలెంలో ప్రయోగాత్మకంగా అమలు

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

### తెనాలిలో 117 త్రీడీ ఇళ్లకు శంకుస్థాపన

### హాజరైన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్






(తెనాలి - జయజయహే)

రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2029 సంవత్సరం పూర్తయ్యే నాటికి రాష్ట్రంలో వంద శాతం పక్కా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి చూపిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో అధునాతన 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా నిర్మించనున్న ప్రయోగాత్మక ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సాధారణంగా ఒక ఇల్లు నిర్మించడానికి దాదాపు రెండేళ్ల సమయం పడితే, ఈ 3డి కాంక్రీట్ ప్రింటింగ్ విధానం ద్వారా కేవలం మూడు నెలల్లోనే నిర్మాణం పూర్తవుతుందని చంద్రబాబు అన్నారు. బుర్రిపాలెంలో ప్రయోగాత్మకంగా మొదటగా 117 ఇళ్లను ఈ సాంకేతికతతో నిర్మిస్తున్నారని చెప్పారు. ఇది విజయం సాధిస్తే రాష్ట్రవ్యాప్తంగా దీనిని విస్తరింపజేస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని, నివాసయోగ్యం కాని కొండలు, గుట్టల్లో పేదలకు స్థలాలు కేటాయించి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని చంద్రబాబు విమర్శించారు. గత 12 ఏళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించి అందించిన ఏకైక ఘనత కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. నాయకుల పనితీరుపై చంద్రబాబు ప్రశంసలు

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు ఉచ్చు

### పాత కేసులు తిరగతోడుతున్నకేరళ... 2006 నాటి అవినీతి వ్యవహారంపై విచారణకు ఆదేశం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు సంబంధించిన 20 ఏళ్ల నాటి పాత కేసు ఒక్కసారిగా తెరపైకి వచ్చింది. ఎస్ఐఆర్, ఎన్నికల రిగ్గింగ్ ఆరోపణల నేపథ్యంలో, కేరళం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాస్పద ఆత్మహత్య, అవినీతి కేసుపై విచారణకు ఆదేశించడం రాజకీయంగా కలకలం రేపుతోంది. 2006లో కేరళం ప్రజా పనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా జ్ఞానేష్ కుమార్ పనిచేసినప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ప్రపంచ బ్యాంకు నిధులతో సుమారు రూ.215 కోట్లతో కేరళం రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ కింద ఎంసీ రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను తీసుకున్న మలేషియా కంపెనీకి చెందిన సివిల్ ఇంజినీర్ లిజ్జీ బీన్, రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతిపై పలు ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత ఆమె మలేషియాకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కేపీసీసీ నాయకుడు మలయింకీళు వేణుగోపాల్ శనివారం చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ మరోసారి తెరపైకి వచ్చింది. కేరళం

..మిగతా 2లో






## దసరాకు కొత్త పెన్షన్లు..!

### ఈ వారంలో అర్హుల జాబితా

### 17 లేదా 18 తేదీన పంపిణీకి సన్నాహాలు

### వృద్ధాప్య, వితంతు పెన్షన్లే అత్యధికం

### రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

2



## ఏపీకి నేనూ మామయ్యనే..!

### మీ మమకారం నా మదిలో ఉంటుంది

### దేశాభివృద్ధిలో ఏపీ టాప్ కావాలి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యలు

(తెనాలి - జయజయహే)

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన మాజీ సీఎం జగన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ధ్వజమెత్తారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి, పేదల సొంతింటి కలను జగన్ చిదిమేశారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబుతో కలిసి

# హనీట్రాప్‌లో నేవీ అధికారి

### పాక్‌కు రహస్య సమాచారం చేరవేత

### కోయంబత్తూరులో అరెస్టు చేసిన కౌంటర్ ఇంటెలిజెన్స్

### విశాఖ నౌకాదళ విభాగంలో విధులు

### దర్యాప్తు చేస్తున్న స్పెషల్ టాస్క్ ఫోర్స్




(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడనే ఆరోపణలపై ఇండియన్ నేవీ చెందిన ఒక నావికుడు అరెస్టయ్యారు. ఇతడిని తమిళనాడులోని కోయంబత్తూర్‌లో అరెస్ట్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సిఐ) విభాగం వెల్లడించింది. ఈ గూఢచర్య ఆపరేషన్‌లో సోషల్ మీడియా ‘హనీ ట్రాప్’ను ఉపయోగించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బంగాల్‌కు చెందిన 31 ఏళ్ల ప్రదీప్ ముఖర్జీ 2014లో నౌకాదళంలో చేరారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, కోయంబత్తూరులోని నౌకాదళ లీడర్‌షిప్ ట్రైనింగ్ సెంటర్ ‘ఐఎన్ఎస్ అగ్రణి’లో ఒక వారం రోజులుగా మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కోర్సులో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే రహస్య సమాచారం చేరవేసిన

..మిగతా 2లో



## సివిల్ వివాదాల్లో జోక్యం చేస్తే సహించం

### పౌర హక్కులను హరించరాదు

### విచారణ చేసే పరిధి మీది కాదు

### హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం

2

# హనీట్రాప్‌లో నేవీ అధికారి



మొదటి పేజీ తరువాయి...

ఆరోపణలతో ముఖర్జీని అక్టోబర్ 3న ఆంధ్రప్రదేశ్ సిఐ సెల్ అధికారులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

**జరిగింది ఇదీ..**

కొన్ని నెలల క్రితం ఒక పాకిస్థానీ మహిళా ఇంటెలిజెన్స్ ఏజెంట్ సోషల్ మీడియా ద్వారా ప్రదీప్ ముఖర్జీతో పరిచయం పెంచుకుంది. ఆపై అతడిని 'హనీ-ట్రాప్'లోకి (వలపు వల) దించింది. ఈ ఆన్‌లైన్ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని, విశాఖపట్నం నావికాదళ స్థావరానికి సంబంధించిన అత్యంత వ్యూహాత్మక సమాచారం, యుద్ధనౌకల కదలికలు, నౌకాదళ కార్యాచరణకు సంబంధించిన రహస్య పత్రాలను ఆమె సేకరించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రదీప్ ముఖర్జీకి సంబంధించిన అనుమానాస్పద డిజిటల్ కదలికలను క్రాస్-బార్డర్ గూఢచర్యం, ఉగ్రవాద ముప్పులను అడ్డుకునే ప్రత్యేక విభాగమైన ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ (డిజిటల్ ఫుట్‌ప్రింట్స్) గుర్తించింది. కొంతకాలంగా అతడిపై నిఘా ఉంచిన అధికారులు, తగిన ఆధారాలతో శనివారం కోయంబత్తూర్‌లో అరెస్ట్ చేశారు. రక్షణ రంగ సిబ్బంది సోషల్ మీడియా హనీ-ట్రాప్‌లు, డిజిటల్ గూఢచర్యం పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ శనివారం రక్షణ సిబ్బందికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఆయన హెచ్చరించిన మరుసటి రోజే ఈ నౌకాదళ నావికుడి అరెస్ట్ ఉదంతం వెలుగులోకి రావడం సంచలనం రేపుతోంది. ఈ ఘటనపైపై రక్షణ శాఖ, ఏపీ పోలీసులు లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు.

**రిటైర్డ్ ఆర్మీ జవాన్ సహా ఇద్దరు అరెస్ట్**

మరోవైపు భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేసిన ఆరోపణలపై కాంట్రాక్ట్ ప్రాతిపదికన తిరిగి ఉద్యోగంలో చేరిన ఒక రిటైర్డ్ ఆర్మీ జవాన్ సహా ఇద్దరిని అరెస్టు చేసినట్లు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆదివారం తెలిపారు. కేంద్ర ఏజెన్సీలు అందించిన సమాచారం ఆధారంగా ఈ అరెస్టులు జరిగాయని ఆయన చెప్పారు. వారి నుంచి సమాచారం రాబట్టేందుకు వారిద్దరినీ హనీట్రాప్‌కు గురిచేశారని వివరించారు. "కేంద్ర ఏజెన్సీల సమాచారం మేరకు అసోం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారిలో ఒకరు రిటైర్డ్ ఆర్మీ జవాన్, కానీ ప్రస్తుతం సైన్యంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వారు పాకిస్థాన్‌తో సంబంధాలు పెట్టుకుని, సైనిక కదలికల గురించి సమాచారం ఇస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. మేము వారిని కేంద్ర ఏజెన్సీలకు అప్పగిస్తాం." అని సీఎం పేర్కొన్నారు. అంతకుముందే ఆదివారం గూఢచర్య సంబంధిత కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణలపై బిహార్ వాసిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసినట్లు అసోం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. భద్రతా దళాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఒక పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ కు అందించడంతో సహా, ఇటువంటి కార్యకలాపాల్లో అతనికి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఆ ప్రకటన పేర్కొంది.

**రక్షణ సమాచారం లీక్- వింగ్ కమాండర్ అరెస్టు**

అంతకుముందు కూడా హనీ ట్రాప్‌లో చిక్కుకొని దేశ రక్షణ సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణలపై ఒక ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) వింగ్ కమాండర్‌ను అరెస్టు చేశారు. సోషల్ మీడియా ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు ఆయనను 'వలపు వల'(హనీ ట్రాప్)లోకి లాక్కున్నారని వైమానిక దళ అధికారులు పేర్కొన్నారు. సదరు అధికారిని తమ నిఘాలో ఉంచి, తర్వాత సంబంధిత విచారణ సంస్థలకు అప్పగించామని చెప్పారు. తాము తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల వల్లే సదరు అధికారి పట్టుబడ్డారని తెలిపారు. అధికారిక రహస్యాల చట్టం (అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్) ప్రకారం, ఇలాంటి నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. దిల్లీ పోలీసుల ప్రకారం, రక్షణ రంగానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని లీక్ చేసినందుకు ఐఏఎఫ్ వింగ్ కమాండర్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. దేశ రక్షణకు సంబంధించిన రహస్య పత్రాలను, సమాచారాన్ని శత్రుదేశాలకు అందించారనే ఆరోపణలపై, సదరు అధికారిపై అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఐఏఎఫ్ అధికారి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు పన్నిన హనీ ట్రాప్‌లో పడ్డాడు. తన తోటి ఉద్యోగి మొబైల్ ఫోన్‌ను కంట్రోల్ చేసేందుకు, డేటాను తస్కరించే ఓ సాఫ్ట్‌వేర్‌ను అందులో ఇన్‌స్టాల్ చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ఐఏఎఫ్ ఇంటెలిజెన్స్ వింగ్, దిల్లీ పోలీసులకు ఇచ్చిన తర్వాతే సదరు అధికారిని అరెస్టు చేశారు.



# దసరాకు కొత్త పెన్షన్లు..!

## ఈ వారంలో అర్హుల జాబితా

## 17 లేదా 18 తేదీన పంపిణీకి సన్నాహాలు

## వృద్ధాప్య, వితంతు పెన్షన్లే అత్యధికం

## రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

(అమరావతి - జయజయహే)

కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లక్షలాది మందికి శుభవార్త. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లను పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. కొత్తగా అందిన 14 లక్షలకుపైగా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత అర్హులను గుర్తించడంలో ప్రభుత్వం నిమగ్నమై ఉంది. తొలి విడతలో సుమారు 3 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో అర్హుల తుది జాబితాను విడుదల చేయనుంది. ఆ తర్వాత అక్టోబర్ 17 లేదా 18 తేదీలలో దసరా కానుకగా కొత్త పెన్షన్లను పంపిణీ చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం మొత్తం 13 రకాల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా, దివ్యాంగుల, నేతన్న, గీత కార్మికుల, మత్స్యకారుల, డప్పు కళాకారుల, చర్మకారుల, హెచ్‌ఐవి బాధితుల, డయాలసిస్ రోగుల, ట్రాన్స్‌జెండర్ల పెన్షన్లు ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న మొత్తం 13 లక్షల 70 వేల మందికిపైగా లబ్ధిదారులలో అత్యధికంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్ దరఖాస్తుదారులు ఉన్నారు. తొలి విడతలో 3 లక్షల పెన్షన్లను ఈ రెండు కేటగిరీల దరఖాస్తుదారులకే ప్రాధాన్యతనిచ్చి పంపిణీ చేయనున్నారు. పెన్షన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం మూడు రకాల ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. డయాలసిస్ రోగులకు నెలకు రూ.10 వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా, గీత కార్మికులు, నేతన్న, డప్పు కళాకారులు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు, హెచ్‌ఐవి బాధితులు వంటి ఇతర కేటగిరీల వారికి నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందిస్తున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పెన్షన్ల పంపిణీలో జాప్యం జరిగింది. వాస్తవానికి అక్టోబర్ 1న కొత్త పెన్షన్లు విడుదల చేయాలని షెడ్యూల్ చేసినా.. సెలవులు, వెరిఫికేషన్ గడువు పొడిగింపు కారణంగా ఇది సాధ్యం కాలేదు. ప్రస్తుతం పాత పెన్షన్‌దారులకు మాత్రమే అక్టోబర్ 1న పెన్షన్లు పంపిణీ చేశారు. అక్టోబర్ మొదటి వారంలో అర్హత, అనర్హత జాబితాలు విడుదలవుతాయి. అనర్హత జాబితాలో పేరు ఉన్న వారికి, ఏ కారణం చేత అనర్హత వచ్చిందో ప్రభుత్వం తెలియజేస్తుంది. పెన్షన్ అర్హతలను నిర్ధారించడంలో ప్రభుత్వం కఠినమైన ప్రమాణాలను పాటిస్తోంది. వయస్సు, కుటుంబానికి ఉన్న భూమి (మెట్టభూమి 10 ఎకరాలు, మాగాని 3 ఎకరాలు మించకూడదు), విద్యుత్ వినియోగం (300 యూనిట్లు మించకూడదు). ప్రభుత్వ ఉద్యోగాలు (కుటుంబంలో ఎవరికీ ఉండకూడదు), పట్టణ ఆస్తి (1000 చదరపు అడుగులు మించకూడదు), నాలుగు చక్రాల వాహనాలు, ఇతర ప్రభుత్వ పెన్షన్లు, అలాగే కుటుంబ ఆదాయం (గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.12 వేలు మించకూడదు) వంటి 12 రకాల అర్హతలను పరిశీలించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేని వారికి పెన్షన్ లభించదు. ప్రస్తుతానికి పెన్షన్ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకునే ఏపీ సేవా పోర్టల్ లేదా ఇతర సైట్లు పనిచేయడం లేదు. దరఖాస్తుదారులు తమ స్టేటస్‌ను తెలుసుకోవడానికి గ్రామ వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ సెక్రటరీని సంప్రదించాలి.



# ప్రతీ కుటుంబానికి సొంతిల్లు

మొదటి పేజీ తరువాయి...

గుప్పించారు. సినీ దిగ్గజం సూపర్ స్టార్ కృష్ణ స్వగ్రామమైన బుర్రిపాలెం ప్రస్తావన తెస్తూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృష్ణ గారు వెండితెర హీరో అయితే, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ ప్రాంతానికి పొలిటికల్ హీరో అని వర్ణించారు. నియోజకవర్గ అభివృద్ధికై పెమ్మసాని నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. నిత్యావసర ధరలు అదుపులో ఉంచడంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు చంద్రబాబు. అలాగే కూటమి విజయం కోసం త్యాగాలు చేసిన సీనియర్ నేత రాజేంద్రప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు ప్రజలతో అనునిత్యం మమేకమవుతున్నారని కొనియాడారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సంక్షేమ పరంగా ముందుకు తీసుకెళ్తున్నామని, రిలయన్స్ వంటి బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. ఆంధ్రా ప్రజలకు తాను మధ్యప్రదేశ్ మామయ్యనే కాకుండా, ఏపీ మామయ్యగా కూడా సేవ అందిస్తానని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ఆలోచనా విధానం, విజన్ దేశానికే దిక్సూచిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఇళ్ల నిర్మాణంలో 3డి ప్రింటింగ్ సాంకేతికతను ప్రవేశపెట్టి దేశంలోనే నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, పేదల గృహ నిర్మాణ లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని శివరాజ్ సింగ్ హామీ ఇచ్చారు.

# ఏపీకి నేనూ మామయ్యనే..!

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఇదే వేదికపై 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే అభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని శివరాజ్ సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పేదల కోసం ప్రధాని మోదీ అనేక పథకాలు, నిధులు ఇస్తే వాటిని జగన్ దారి మళ్లించి పాపం చేశారని శివరాజ్‌సింగ్ దుయ్యబట్టారు. రాష్ట్ర వాటా ఇచ్చేందుకు నిరాకరించి, పేదల ఇళ్లను లాక్కుని మూర్ఖుడిలా ప్రవర్తించారని విమర్శించారు. మోదీ ఇచ్చిన ఇళ్లను జగన్ నిర్మించి ఉంటే, ఈపాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండేదన్నారు. విధ్వంస ఆలోచనలతో జగన్ పేదల కలను పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు.

'దిల్ మాంగే మోర్' : సీఎం చంద్రబాబు సంకల్ప బలం చాలా గొప్పదని శివరాజ్ సింగ్ కొనియాడారు. కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం ఏపీకి 76 వేల ఇళ్లు వస్తాయని అధికారులు చెప్పగా, చంద్రబాబు అది సరిపోదన్నారని గుర్తుచేశారు. దీంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అయితే ఇవాళ చంద్రబాబు మాట్లాడుతూ 'దిల్ మాంగే మోర్' అన్నారని 3 లక్షలు కాదు 6 లక్షల ఇళ్లు కావాలని తనను కోరారని తెలిపారు. ఇప్పుడు మంజూరు చేసిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలోపు మరో 3 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఆ మూడు లక్షల ఇళ్లు పూర్తయ్యాక, ఇంకో 3 లక్షల ఇళ్లు ఇస్తామని, ఏపీలో వందశాతం ఇళ్ల నిర్మాణం జరిగేలా కేంద్రం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతికి అమరావతి మూలమని, కేంద్రం నుంచి ఏపీకి పూర్తి సహాయం అందుతోందని శివరాజ్ సింగ్ స్పష్టం చేశారు. మోదీ, చంద్రబాబు, పవన్ కలిసి రాష్ట్ర ప్రగతికి ముగ్గురు మార్గదర్శకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇళ్ల నిర్మాణంలో వినియోగిస్తున్న 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ దేశానికే రోల్‌మోడల్ అవుతుందన్నారు. టెక్నాలజీపై ముందే ఆలోచించే చంద్రబాబు విజన్, దేశానికే ఒక దిక్సూచిగా మారనుందని ప్రశంసించారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా అక్టోబర్ 15న విజయవాడలో 'సరస్ మేళా' నిర్వహించబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఏపీకి కూడా నేను మామయ్యనే :**

ఏపీ ప్రజలంటే తనకు ఎంతో ప్రేమ అని శివరాజ్ సింగ్ అన్నారు. తాను కేవలం మధ్యప్రదేశ్‌కే కాదు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామయ్య వంటివాడినే అని వ్యాఖ్యానించారు. తెనాలి చరిత్ర, తెనాలి రామకృష్ణుడి కీర్తి గురించి తాను చిన్నప్పటి నుంచీ విన్నానని గుర్తుచేసుకున్నారు. ప్రతిభకు మారుపేరైన ఈ పుణ్యభూమికి కోటి ప్రణామాలు చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రజలతో మమేకమయ్యే తీరు తనకు చాలా నచ్చిందని, ఏపీ ప్రజల మమకారం ఎప్పటికీ తన మదిలో నిలిచి ఉంటుందని ఆయన చెప్పారు. దేశంలోనే అభివృద్ధిలో ఏపీ ప్రథమ స్థానంలో నిలవబోతోందని స్పష్టం చేశారు.



# బీపీసీఎల్ ప్రాజెక్టుకు ఓకే..!

## కేంద్ర పర్యావరణ శాఖ గ్రీన్ సిగ్నల్

## లక్ష కోట్ల పెట్టుబడులతో పెట్రోకెమికల్ ఉత్పత్తులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్ట్‌కు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. రూ.1 లక్ష కోట్లకు పైగా అంచనా వ్యయంతో నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్ట్ సమీపంలో 5,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ కాంప్లెక్స్ ద్వారా ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, ప్రాజెక్ట్ ప్రాంగణంలో 30 శాతం మేర (సుమారు 1,563 ఎకరాలు) గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేసేందుకు బీపీసీఎల్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రాజెక్ట్ రాకతో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మరింత ఊతెక్కనుంది.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు ఉచ్చు



మొదటి పేజీ తరువాయి...

హోం మంత్రి రమేష్ చెన్నితాల ఈ ఫిర్యాదుపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. సీఎం వి.డి. సతీసన్‌తో చర్చించిన అనంతరం, సమగ్ర విజిలెన్స్ విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ డైరెక్టర్ మనోజ్ అబ్రహాంను హోంశాఖ ఆదేశించింది. ఎస్ ఐ ఆర్ వివాదం, పలు రాష్ట్రాల్లో భారీగా ఓట్ల తొలగింపు, ఈవీఎంలపై ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. సీజేపీ , ప్రతిపక్షాలు దిల్లీలో నిరసనలు చేస్తున్నాయి. ఈ తరుణంలో జ్ఞానేష్ కుమార్ పై 20 ఏళ్ల క్రితం నమోదైన కేసును కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి వచ్చింది. ఈ కేసును విచారించాలని విజిలెన్స్ ను ఆదేశించింది.



# అది ఆగ్రహం కాదు.. ఉత్సాహం

మొదటి పేజీ తరువాయి...

స్పష్టం చేశారు. సభకు హాజరైన ప్రజల్లో కనిపించింది ఆగ్రహం కాదని, కూటమి ప్రభుత్వం పట్ల వారిలో వెల్లువెత్తిన అపారమైన ఉత్సాహం, అనూహ్య స్పందన అని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన విపరీతమైన ఉత్సాహాన్ని నియంత్రించి, సభను సజావుగా నడిపించేందుకే తాను కొద్దిసేపు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ప్రజల ఉత్సాహాన్ని కోపంగా చిత్రీకరించడాన్ని బట్టి చూస్తే.. కాంగ్రెస్ నాయకులు ప్రజల ఆలోచనలకు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సోషల్ మీడియాలో అసత్య కథనాలు అల్లినంత మాత్రాన ప్రజల అసలైన భావాలను మార్చలేరని తేల్చిచెప్పారు.

**ఫేక్ న్యూస్‌ను వెంటనే డిలీట్ చేయాలి: మంత్రి లోకేశ్ వార్నింగ్**

సీనియర్ నేతగా ఉండి వాస్తవాలు నిర్ధారించుకోకుండా ఫేక్ వీడియోలను ప్రచారం చేయడం జైరాం రమేశ్ స్థాయికి తగదని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని ఉద్యోగాలు కావాలంటూ స్థానిక యువత అడ్డుకున్నారంటూ ప్రచారం చేయడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. ప్రజలతో ఆర్థిక మంత్రి సాధారణంగా మమేకమైన దృశ్యాలను కుట్రపూరితంగా కట్ చేసి, వక్రీకరించి వీడియోలను వైరల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకుడు ట్వీట్ చేసేముందు వాస్తవాలను నిర్ధారించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాలను సహించేది లేదని స్పష్టం చేస్తూ, ఆ అబద్ధపు ట్వీట్‌ను జైరాం రమేశ్ తక్షణమే తొలగించాలని లోకేశ్ గట్టిగా డిమాండ్ చేశారు.

# శ్రీకాళహస్తిలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పర్యటన

### పంటలను పరిశీలించిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్

### రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 04, జయ జయహే**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, కేంద్ర ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీ ప్రభాత్ కుమార్ పర్యటించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శ్రీ బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో తదితర అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గానికి చేరుకున్న కేంద్ర మంత్రి బృందానికి శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రంగినేని చంచయ్య నాయుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోల ఆనంద్ కుమార్ ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తి మండలం వేడం పంచాయతీలో రైతు బాలిరెడ్డికి చెందిన ఏడెకరాల పొలాన్ని కేంద్ర మంత్రి బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నియోజకవర్గంలో వివిధ రకాల వ్యవసాయ, ఉద్యానవన పంటలు సమృద్ధిగా సాగుతుండటంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక రైతులు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంటల దిగుబడులను పరిశీలించిన మంత్రి రైతులను అభినందించారు. వ్యవసాయ రంగంలో రైతులు మరింత అభివృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీ ప్రభాత్ కుమార్ శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పండితులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయగా, వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బొజ్జల సుధీర్ రెడ్డి సూచనల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రంగినేని చంచయ్య నాయుడు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ రైతులకు పంటల నిల్వ కోసం అవసరమైన గోడౌన్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను త్వరితగతిన మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రంపై స్పందించిన కేంద్ర మంత్రి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సానుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల టీడీపీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్, కామేష్ యాదవ్, వేడం గ్రామస్తుడు దొరై రాజ్‌తో పాటు పలువురు గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి గవరపాలెం వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనార్థం అనకాపల్లికి విచ్చేయడం జరిగింది ఈ సందర్భంగా మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సాదర స్వాగతం పలకడం జరిగింది. ఆలయ పాలకవర్గ సభ్యులు మరియు దేవస్థానం సిబ్బంది ఆలయ అర్చక పురోహితలు వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పూర్ణ కలశం తో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ బేడ మండపంలో హోంమంత్రి వంగలపూడి అనితకు దేవాలయం పాలకవర్గ సభ్యులు పట్టు వస్త్రాలు అమ్మవారి పసుపు కుంకుమ ప్రసాదములు, చిత్రపటం అందించి అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీల నాగ శ్రీను( గొల్ల బాబు ) ఆలయ ఈవో వై శ్రీధర్ కూటమి నాయకులు కార్యకర్తలు ఆలయ డైరెక్టర్లు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## మన్యం జిల్లా తెలుగుదేశం నాయకులతో దాడి రత్నాకర్ సమావేశం

**అనకాపల్లి జయ జయహే**

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ 0 లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గుమ్మ లక్ష్మీపురంలో స్థానిక ఎమ్మెల్యే తోయ్యాక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గురుగుబిల్లి మండలం తెలుగుదేశం కార్యకర్తల సమావేశం కి అనకాపల్లి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి రత్నాకర్ ముఖ్యఅతిథిగా జిల్లా ఎన్నికల ఇన్చార్జి గా మరియు నియోజకవర్గ పరిశీలకులు మాదారపు వెంకటేష్ పాల్గొని మండలంలోని పార్టీ ప్రెసిడెంట్లు సెక్రటరీలు క్లస్టర్ ఇన్చార్జిలు యూనిట్ ఇన్చార్జిలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు పై ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా నాయకులందరూ కార్యకర్తలు పాటుపడాలని ఈ ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని అలాగే ఆజా గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సమావేశంలో నాయకులు దాడి రత్నాకర్, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి పేర్కొనడం జరిగింది



## ఓటమిని జీర్ణించుకోలేకే వైసీపీ నిరాదార ఆరోపణలు

### వైసీపీ నేతలపై కూటమి నేతలు ఫైర్ .. ఎమ్మెల్యే రాజు అజాత శత్రువు

**బుచ్చియ్యపేట జయ జయహే**

ఓటమిని జీర్ణించుకోలేకే వడ్డాది ఎస్ఎంసీ ఎన్నికలపై వైసీపీ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేసారని స్థానిక కూటమి నేతలు ఖండించారు. ఆదివారం వడ్డాదిలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్ ఎస్. శ్రీరామ మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్, మాజీ అధ్యక్షుడు సన్యాసిరావు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇసుక, ఇళ్ల స్థలాలు, అంగన్వాడీ పోస్టులలో అవినీతికి పాల్పడిన వారే తమపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. అవినీతి మచ్చ లేదు కనుకనే కెఎస్ఎన్ఎస్ రాజుని మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారన్నారు. తాము ఎస్ఎంసి ఎన్నికలలో డబ్బులు పంపిణీ చేసినట్లు ఆధారాలు చూపించగలరా అని ప్రశ్నించారు. విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న సంస్కరణలు, చోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసే తల్లిదండ్రులు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. వైసీపీ నేతలే తల్లిదండ్రులను ఓటింగ్ కు వెళ్లకుండా శిబిరం ఏర్పాటు చేసి నిర్బంధించారన్నారు. ఎమ్మెల్యే వివాద రహితుడిగా, అజాతశత్రువుగా పని చేస్తున్నారన్నారు. అవినీతికి పాల్పడినందువలనే మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎలమంచిలికి వెళ్లిపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలే భయభ్రాంతులకు గురిచేసి, డబ్బులతో ప్రలోభాలు పెట్టి టీడీపీ జడ్పిటిసి అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకున్నారన్నారు. వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాన నాయకులు రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. సీనియర్ టిడిపి నేత దొండా గిరిబాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సింగంపల్లి రమేష్, హైస్కూల్ చైర్మన్ కోవెల వెంకటరమణ, కుబిరెడ్డి వెంకటరావు, కోరుకొండ గురుమూర్తి, వీర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాద పూర్వక కలయిక

**నాగపూర్ జయ జయహే**



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ను వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. సేవా సంకల్ప యాత్ర లో భాగంగా నాలుగో రోజు నాగపూర్ చేరుకున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం నాగపూర్ లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ను కలిసి, ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పురస్కరించుకొని తిరుపతి నుంచి వారణాసి వరకు సేవా సంకల్ప యాత్ర పేరిట బైక్ యాత్ర చేపట్టామని మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కి వివరించారు. బైక్ యాత్ర లో భాగంగా ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శన వంటి వాటిని తెలియజేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బైక్ యాత్ర చేపడుతున్న వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ను అభినందించారు. ఎం వి ప్రణవ్ గోపాల్ తో పాటు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు , ఇతర టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ప్రతినిధులు పాల్గొన్నారు.

# పచ్చని పొలాలు 'మనఊరి' ప్రకృతి అందాలు





**దేవరాపల్లి, జయ జయహే :**

ప్రకృతి ఒడిలో పచ్చని పొలాలు ఎంతో అందంగా కంటికి కనువిందు చేస్తున్నాయి. ఈ అందాలు మనసుకి ఎంతో ప్రశాంతతను ఇస్తాయి. కనుచూపు మేరలో ఈ పచ్చని వరి పంట పొలాలు చూడడానికి రెండు కళ్ళు చాలవు. మన గ్రామీణ పల్లెల పచ్చని వరి పంట పొలాలు... ప్రకృతి అందాల మధ్య ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తాయి. ఈ అద్భుతమైన పల్లె ప్రకృతి దృశ్యాలు చూసి పొలాల మధ్య నడిచే ప్రకృతి ప్రేమికులు ఆనందిస్తూ.. పరవశించిపోతున్నారు. రైతుల శ్రమతో పండే ఈ పంటలు ఆహారం అందించడమే కాకుండా పర్యావరణానికి కూడా హరిత సౌందర్యాన్ని అందిస్తాయి. రైవాడ జలాశయం పరిధిలోని ఆయకట్టు భూములు పచ్చని పొలాలతో కళకళ లాడుతున్నాయి.



## సివిల్ వివాదాల్లో జోక్యం చేస్తే సహించం

### పౌర హక్కులను హరించరాదు

### విచారణ చేసే పరిధి మీది కాదు

### హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం

**(అమరావతి - జయజయహే)**

భూములు, ఆస్తి తగాదాలు, సివిల్ వివాదాలు, ముఖ్యంగా సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సివిల్ కేసుల్లో పౌరుల హక్కులను నిర్ణయించే పరిధి పోలీసులది కాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు ఇటీవల ఒక కీలక తీర్పును వెలువరించారు. వివిధ జిల్లాలకు చెందిన పోలీసులు తమ సివిల్ వివాదాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని, ముఖ్యంగా సివిల్ కోర్టుల్లో దావాలు ఉన్నప్పటికీ కలగజేసుకుంటూ వేధింపులకు గురిచేస్తున్నారంటూ హైకోర్టులో ఏడు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపిన న్యాయమూర్తి పౌరుల వ్యక్తిగత, సివిల్ హక్కుల రక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. పౌరుల సివిల్ హక్కుల్లో పోలీసుల జోక్యం వివిధ రకాల సమస్యలకు, అశాంతికి దారితీస్తుందని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా చూసేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లకు చట్టప్రకారం తగిన ఆదేశాలు ఇచ్చే అధికారాలు ఉన్నప్పటికీ ఒక వివాదం సివిల్ కోర్టు పరిధిలోకి వెళ్లిన తర్వాత వారు ఆ అధికారాలను వినియోగించడానికి వీల్లేకుండా పోతుందని స్పష్టం చేశారు. పౌరుల సివిల్ హక్కులను నిర్ణయించే సర్వాధికారాలు కేవలం సివిల్ కోర్టులతో పాటు చట్టబద్ధంగా ఏర్పాటైన ఫోరాలకు మాత్రమే ఉంటాయని న్యాయస్థానం గుర్తుచేసింది. సివిల్ వివాదాల విషయంలో పోలీసులు ఏ పరిధి వరకు వ్యవహరించాలి, ఏ విధంగా నడుచుకోవాలనే అంశాలపై గతేడాది అక్టోబరు 24న రాష్ట్ర డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారని న్యాయమూర్తి పేర్కొన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు జారీ చేసిన ఆ ఉత్తర్వులను, గైడ్‌లైన్స్‌ను రాష్ట్రంలోని పోలీసులందరూ విధిగా, తప్పనిసరిగా పాటించాల్సిందేనని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పోలీసుల విధులకు, కోర్టుల పరిధికి మధ్య ఉన్న లక్ష్మణ రేఖను దాటవద్దని హెచ్చరించింది.

## కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో వరుణ యాగం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 6వ తేదీన ఉదయం 6.54 గంటలకు వరుణ యాగం, వరుణ జపం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలకు సకాలంలో వర్షపాతం అందాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై వరుణ యాగం, వరుణ జపంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు కోరారు. ఈ కార్యక్రమానికి శ్రీ దేవులపల్లి రవిశంకర్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా పాల్గొననున్నట్లు తెలిపారు.



## శ్రీ పార్వతి దేవి విగ్రహానికి రాట ముహూర్తం

**నిడదవోలు దయచేసి ప్రతినిధి :**

నిడదవోలు పట్టణంలోని దీనబంధువారి వీధిలో శ్రీ పార్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు 11 సంవత్సరాలు పూర్తయి, 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శుక్రవారం రాట ముహూర్తం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు టౌన్ జనసేన పార్టీ అధ్యక్షులు రంగా రమేష్, టీడీపీ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, గంటా బుజ్జి, మాజీ కౌన్సిలర్ రాజా రామ్మోహన్ రాయ్, గుడ్ల బుజ్జి, ఫౌండ్రీ వెంకటనారాయణ, సోమరాజు, ఆంజనేయులు బాబు, బండి రాంబాబు, గోపాల, కరి శేషు, జనసేన, టీడీపీ నాయకులు బొల్ల శ్రీనివాస్ గౌడ్, దేవల శ్రీనివాస్, లాయర్ విశ్వనాథ్, మాజీ కౌన్సిలర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ పార్వతి దేవి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

For a pure tomorrow..
జయహో



## చైనాపై ఆధారపడటం తగ్గించాలి

(సి.హెచ్. ప్రతాప్)

భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. “మేక్ ఇన్ ఇండియా”, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు, సెమీకండక్టర్ మిషన్, ఎలక్ట్రానిక్స్ తయారీ ప్రోత్సాహకాలు---ఇవన్నీ దేశీయ పరిశ్రమకు కొత్త ఊపు ఇచ్చాయి. ఫలితాలు కూడా కనిపిస్తున్నాయి. 2014-15లో రూ.1.9 లక్షల కోట్లుగా ఉన్న ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 2025-26 నాటికి రూ.13 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు కూడా భారీగా విస్తరించాయి. స్మార్ట్‌ఫోన్లు దేశ ప్రధాన ఎగుమతి వస్తువుల్లో ఒకటిగా నిలవడం భారత తయారీ సామర్థ్యానికి నిదర్శనం.

అయితే ఇప్పటివరకు వచ్చిన పురోగతిని చిన్నచూపు చూడాల్సిన అవసరం లేదు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాల ద్వారా భారీ పెట్టుబడులు వచ్చాయి. లక్షల కోట్ల రూపాయల ఉత్పత్తి, ఎగుమతులు నమోదయ్యాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. మొబైల్ ఫోన్ల దేశీయ అవసరాల్లో అత్యధిక భాగం ఇప్పుడు దేశీయ తయారీ ద్వారానే తీరుతోంది. ఇది సరైన దిశలో పడిన బలమైన అడుగు.




కానీ ఈ విజయాల వెనుక మరో కఠిన వాస్తవం దాగి ఉంది. తయారీ భారత్‌లో జరుగుతున్నా, దానికి అవసరమైన కీలక విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, ఔషధాల ముడిపదార్థాలు, సౌర పరికరాలు, పారిశ్రామిక రసాయనాల కోసం చైనాపై ఆధారపడటం ఇంకా గణనీయంగానే ఉంది. చైనాతో భారత వాణిజ్య లోటు భారీ స్థాయిలో కొనసాగుతుండటం ఈ అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం.

ఇక్కడే “భారత్‌లో తయారీ”కి కొత్త నిర్వచనం అవసరం. విదేశాల నుంచి భాగాలు తెచ్చి ఇక్కడ అసెంబ్లింగ్ చేయడమే స్వావలంబన కాదు. రూపకల్పన నుంచి ముడిసరుకు వరకు, భాగాల తయారీ నుంచి అత్యాధునిక యంత్రాల వరకు పూర్తి సరఫరా గొలుసు దేశంలోనే బలపడాలి. ఎలక్ట్రానిక్స్‌లో దేశీయ విలువ జోడింపు ఇంకా పరిమిత స్థాయిలోనే ఉండటం ఆందోళన కలిగించే అంశం. తుది ఉత్పత్తిపై భారత ముద్ర ఉన్నా, దానిలోని అనేక కీలక భాగాలు విదేశాల నుంచే వస్తే నిజమైన స్వావలంబన సాధించినట్లుకాదు.

ఇప్పుడు తదుపరి దశ మరింత కీలకం. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చౌక రుణాలు, సాంకేతిక సహాయం అందాలి. పరిశోధన, రూపకల్పనలో పెట్టుబడులు పెరగాలి. సెమీకండక్టర్లు, బ్యాటరీలు, అరుదైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, ఔషధ ముడిపదార్థాల్లో దేశీయ సామర్థ్యాన్ని వేగంగా పెంచాలి. సరఫరా గొలుసును ఒకే దేశంపై ఆధారపెట్టకుండా విస్తరించాలి.ప్రపంచానికి భారత్‌లో తయారైన వస్తువులు అమ్మడం ఒక్కటే విజయం కాదు. వాటిని తయారు చేయడానికి కావాల్సిన సాంకేతికత, భాగాలు, ముడిసరకులు కూడా మన నియంత్రణలోకి రావాలి. లేకపోతే ఫ్యాక్టరీ మనదైనా, దాని తాళంచెవి మరొకరి చేతిలోనే ఉంటుంది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ ఎదగాలంటే ముందుగా చైనాపై ఆధారపడటం తగ్గించాలి.

# మానసిక ఆరోగ్య వారోత్సవాలు-2026

### అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు రెండవ రోజు శీర్షిక

## కుటుంబ సమస్యలు మానసిక ఆరోగ్యం.. మనసుకి ఆహ్లాదం కలిగే మొదటి ఔషధం గృహమే...!



రక్తసంబంధంతో, వివాహ సంబంధంతో ఏర్పడే వ్యక్తుల సమాహారమే కుటుంబం. ఒకరికోసం ఒకరు ఆలోచన చేస్తూ త్యాగాలు చేస్తూ బతకడమే కుటుంబం. ఎవరికి ఏ అవసరం వచ్చినా తోడుగా సహాయాన్ని అందించి ఆ వ్యక్తి బాధను మన బాధగా స్వీకరించడమే కుటుంబం సంస్కారాన్ని నేర్పే తొలిబడి కుటుంబం. ప్రస్తుత కాలంలో అమ్మానాన్న పిల్లలు ఉండే వ్యష్టి కుటుంబాల్లో, నానమ్మ - తాతయ్య, అమ్మమ్మ - తాతయ్య, మావయ్య -అత్త పిన్ని - బాబాయి ఉన్న ఉమ్మడి కుటుంబాల్లో అనేక రకాలైన భావద్వేగాలు చింతలు ఏర్పడి వ్యక్తులలో మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నాది. అధిక సంపాదన కోసం పడే తపన, పని భారం ఉద్యోగ జీవితం పరుగులు ఉరుకలతో కూడిన దినచర్య, సమయం తక్కువ అవడం, సమయం ఎక్కువ లేకపోవడం వలన ఉన్న సమయాన్ని పిల్లలతో గడప లేకపోవడం వలన ఇవన్నీ మానసిక ఆరోగ్యం పైన ప్రభావం చూపి వ్యక్తులను కుంఠనానికి లోనయ్యే పరిస్థితుల్లోకి తీసుకు వెళ్లేలా చేస్తున్నాయి. కుటుంబంలో ఉన్న వ్యక్తులు మధ్య అభిప్రాయాలను తెలుసుకుంటూ, ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవించుకుంటూ, ఒకరికొకరు ఉన్నాము అనే ధైర్యాన్ని విషయాన్ని గ్రహించుకున్నప్పుడే కుటుంబంలో ఉన్న వ్యక్తుల మానసిక ఆరోగ్యం అభివృద్ధి చెందుతుంది.

కుటుంబ సభ్యులతో ఎటువంటి సత్సంబంధం ఉంటే మెరుగైన మానసిక ఆరోగ్యం లభిస్తుంది

1. మానసిక భద్రత-కుటుంబం

ప్రపంచం మొత్తం కాదు వద్దు అన్న నా కుటుంబం నాకు ఉంది అనే భద్రత ఈ భద్రత నే మానసిక భద్రత అంటారు. ఈ భద్రాత మనిషి భయాన్ని దూరం చేస్తుంది.

2. ప్రేమ ఆప్యాయతల నిలయం కుటుంబం

ధనంతో కొనలేని వస్తువు ప్రేమ మాత్రమే.ఇది ఒకే ఒక్క ప్రదేశంలో లభిస్తుంది కుటుంబంలోనే మాత్రమే.

తల్లి గారాబం,తండ్రి భుజబలం, తోబుట్టువుల స్పర్శ మరియు ఆటలు మనసుకు ఉత్తేజాన్ని ఇచ్చి ఔషధము లా పని చేస్తాయి.

3. సంస్కారం అనే శిక్షణ ఇచ్చే కేంద్రమే కుటుంబం

మంచి, చెడు, గౌరవం, సహాయం ఇవన్నీ కుటుంబంలోనే లభిస్తాయి.

4. కష్టసుఖాల్లో అండ కుటుంబం

ఒకరికి అనారోగ్యం అయితే వేరొకరు నేనున్నాను నీకు ఏమీ పర్లేదు అని ఇచ్చే భరోసా స్థావరమే కుటుంబం.

5. సామాజిక గుర్తింపు కుటుంబం వలన మాత్రమే

పిల్లలు పెరిగి పెద్దయ్యాక ఫలానా వారి అబ్బాయి ఫలనా వారి అమ్మాయి అని ప్రత్యేక గుర్తింపు ఇచ్చేది కుటుంబ వ్యవస్థ. ఆ విధంగా పిల్లల గుర్తింపు కోసం తల్లిదండ్రులు అహర్నిశలు కష్టపడాలి సక్రమంగా మంచి జీవన విధానాన్ని గడపాలి.

6. వృద్ధాప్యంలో తోడు నీడ కుటుంబం

చిన్నతనంలో పెద్దవారితోడు పెద్దవారికి చిన్నపిల్లల తోడు దొరికే ప్రదేశం కుటుంబం మాత్రమే.

7. ఆర్థిక భద్రత కుటుంబ వ్యవస్థ

కుటుంబంలో ఉన్న వ్యక్తులు అందరూ సంపాదిస్తే ఖర్చులు తగ్గుతాయి ఒకరి మీద ఎక్కువ ఆర్థిక భారం పడదు. సంపాదించే వ్యక్తులకు ధనము విలువ తెలుస్తుంది అనవసర అధిక ఖర్చులు తగ్గుతాయి, స్వయం సంపాదనలో మానసిక తృప్తి కలుగుతుంది. దీని ద్వారా కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది.

8.మానసిక ఆరోగ్యాన్ని కాపాడే కోట కుటుంబం-

Mental health protector

ఈ అష్ట విధానాల ద్వారా కుటుంబంలో వ్యక్తులు వ్యక్తిగతంగా అనుభవించే మానసిక అనారోగ్య సమస్యలు కుంటనానికి లోనయ్యే పరిస్థితులను చాలా సులభతరంగా అధిగమించవచ్చును. ఎటువంటి ఇబ్బందులు ఒడిదుడుకులు లేకుండా మనశ్శాంతిగా జీవనం సాగించవచ్చును.




రచన
ఏ. బాల సౌజన్య కుమారి,
తెలుగు ఆచార్యులు, నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన. కర్త.

# సృజనాత్మకతకు చిరునామా సింగీతం

సి.హెచ్. ప్రతాప్

**సినిమా దర్శకుడు కథ చెబుతాడు. గొప్ప దర్శకుడు కథను కొత్తగా చెబుతాడు. కానీ సింగీతం శ్రీనివాసరావు కథ చెప్పే పద్ధతినే మార్చేశారు. అందుకే ఆయనను కేవలం దర్శకుడు అనడం తక్కువే. ప్రయోగాన్ని సిద్ధాంతంగా, సాంకేతికతను సాధనంగా, ఊహాశక్తిని ప్రయోగశాలగా మార్చుకున్న నిజమైన ‘సినిమా శాస్త్రవేత్త’ ఆయన.**



1931 సెప్టెంబర్ 21న గూడూరులో జన్మించిన సింగీతం, భౌతికశాస్త్రంలో విద్యాభ్యాసం చేసి సినిమారంగం వైపు అడుగేశారు. ప్రముఖ దర్శకుడు కె.వి.రెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేసి సినీ భాషను లోతుగా అభ్యసించారు. 1972లో నీతి నిజాయితీతో దర్శకుడిగా స్వతంత్ర ప్రయాణం ప్రారంభించారు. ఆ తర్వాత ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో 60కిపైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు.

సింగీతం ప్రత్యేకత విజయవంతమైన ఒకే ఫార్ములాను పదే పదే అనుసరించడం కాదు. ప్రతి చిత్రాన్నీ కొత్త ప్రయోగంగా మలచడం. మాటలే సినిమాకు ప్రాణమని భావించిన కాలంలో పుష్పక విమానంను దాదాపు సంభాషణలే లేని చిత్రంగా రూపొందించి భారతీయ సినిమాకు సరికొత్త దిశ చూపించారు. భాష లేకుండానే భావోద్వేగం ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించగలదని నిరూపించారు. ఈ చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా గుర్తింపు పొందింది.

ఆదిత్య 369తో తెలుగు ప్రేక్షకుడిని కాలయంత్రంలో కూర్చోబెట్టారు. టైమ్ ట్రావెల్, విజ్ఞానకల్పన వంటి అంశాలు ప్రధాన స్రవంతి సినిమాకు దూరంగా ఉన్న రోజుల్లోనే వాటిని వినోదంతో మేళవించారు. భైరవద్వీపంలో జానపద ఫాంటసీకి సాంకేతిక వైభవాన్ని జోడించారు. అపూర్వ సహోదరులు, మైఖేల్ మదన కామరాజన్ వంటి చిత్రాల్లో క్లిష్టమైన పాత్ర నిర్మాణం, హాస్యం, సాంకేతిక విన్యాసాలను సమన్వయం చేశారు. ఒకే దర్శకుడు సైన్స్ ఫిక్షన్, మూకీ కామెడీ, బయోపిక్, ఫాంటసీ, సామాజిక కథ, హాస్య చిత్రం---ఇన్ని భిన్న ప్రక్రియల్లో ముద్ర వేయడం అరుదైన విషయం.

మయూరి ఆయన సృజనాత్మకతకు మరో శిఖరం. ప్రమాదంలో కాలు కోల్పోయినా నృత్యంతో జీవితాన్ని జయించిన సుధా చంద్రన్ కథను తెరపైకి తీసుకొచ్చిన ఈ చిత్రం విశేష ప్రశంసలు అందుకుంది. 14 నంది పురస్కారాలు సాధించడం దీని ప్రత్యేకత. ఆశ కోల్పోయిన మనిషికి సంకల్పం ఎంతటి శక్తినిస్తుందో సింగీతం హృదయానికి హత్తుకునేలా చూపించారు.

పురస్కారాల పరంగా కూడా ఆయన ప్రస్థానం విశిష్టం. దిక్కుట్ర పార్వతి, పుష్పక విమానం వంటి చిత్రాలకు జాతీయ స్థాయిలో గౌరవాలు లభించాయి. నంది పురస్కారాలు, కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు, ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు సహా అనేక సత్కారాలు ఆయన ఖాతాలో చేరాయి. జీవిత సాఫల్య పురస్కారాలతో పాటు బి.ఎన్.రెడ్డి జాతీయ చలనచిత్ర పురస్కారం వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలు కూడా అందుకున్నారు.

సింగీతం జీవితంలో అత్యంత ప్రేరణాత్మక అంశం పురస్కారాల సంఖ్య కాదు---వయసు పెరిగినా ఆయనలోని విద్యార్థి వృద్ధుడవలేదు. కొత్త కథ, కొత్త సాంకేతికత, కొత్త కథన నిర్మాణం గురించి నిరంతరం ఆలోచించారు. సృజనాత్మకతకు పదవీ విరమణ లేదని తన జీవితంతోనే నిరూపించారు.

సాంకేతికత ఎంత మారినా సింగీతం మనకు నేర్పిన సూత్రం ఒక్కటే---కొత్తగా ఆలోచించే ధైర్యమే నిజమైన ప్రతిభ. విజయాన్ని అనుకరించడం సులువు; ఎవ్వరూ నడవని దారిలో మొదటి అడుగు వేయడం కష్టం. ఆ మొదటి అడుగును పదే పదే వేసిన దర్శకుడు సింగీతం.

అందుకే ఆయన సినిమాలు మాత్రమే తీయలేదు---సినిమాపై ప్రయోగాలు చేశారు. సిద్ధాంతాలను పరీక్షించారు. అసాధ్యమనుకున్న వాటికి తెరపై రూపమిచ్చారు.

సింగీతం శ్రీనివాసరావు ఒక దర్శకుడిగా వచ్చారు.

ఒక పాఠశాలగా ఎదిగారు.

భారతీయ సినిమా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన ‘సినిమా శాస్త్రవేత్త’గా మిగిలారు.



## ఆక్రమణల చెర నుంచి గాంధీ పార్కు స్థలాన్ని కాపాడాలి

### బీఎస్పీ అరకు లోయ మండల అధ్యక్షురాలు కొర్ర ప్రియాంక రాజ్ డిమాండ్

**అరకులోయ, అక్టోబర్ 04: జయ జయహే.**

అరకు వేలి మండలం పెదలబుడు పంచాయతీ పరిధిలోని గాంధీ పార్కు కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అరకు లోయ మండల అధ్యక్షురాలు కొర్ర ప్రియాంక రాజ్ అధికారులను డిమాండ్ చేశారు. అరకు వేలిలోని గాంధీ పార్కు, ప్రెస్ క్లబ్, ఐటీడీఏ వ్యాపార సముదాయం, గ్రంథాలయం పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలపై కొందరు ఆక్రమణలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పునాదులు వేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఆక్రమణల కారణంగా గ్రంథాలయానికి వెళ్లే మార్గం ఇబ్బందికరంగా మారడంతో విద్యార్థులు, యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో గ్రంథాలయం వెనుక భాగంలో మహాత్మా గాంధీ విగ్రహం ఉండేదని, ప్రస్తుతం ఆ ప్రాంతం ఆక్రమణలతో తన ప్రాధాన్యతను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అక్కడ మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రియాంక రాజ్ కోరారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల స్మారకాలకు కేటాయించిన స్థలాలను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గాంధీ పార్కు స్థలాన్ని తక్షణమే సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# ప్రభుత్వ డ్రైవర్‌తో వెట్టి చాకిరీ...!

### డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో అవినీతి దందా

### ఎంపీహెచ్ఈఓ తీరుపై ఉద్యోగుల తీవ్ర ఆరోపణలు

### డ్రైవర్‌ను వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారంటూ మండిపాటు

**విశాఖపట్నం, అక్టోబర్ 4, జయ జయహే :**

అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగుల విధుల నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా డెప్యూటేషన్‌పై కార్యాలయానికి వచ్చిన ఓ ఎంపీహెచ్ఈఓ తీరుపై ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగిని డీఎంహెచ్ఓ కార్యాలయానికి తీసుకురావడం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు ఇప్పుడు శాఖలో చర్చనీయాంశంగా మారాయి. డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డ్రైవర్ బి.అప్పారావును ఇంక్రిమెంట్ నిలిపివేస్తానని బెదిరిస్తూ తన వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కారు శుభ్రం చేయించడం, సిగరెట్లు తెప్పించుకోవడం, టీలు..టిఫిన్లు రప్పించుకోవడం తదితర వ్యక్తిగత పనులు చేయించుకుంటూ డ్రైవర్‌ను సేవకుడిలా ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే డ్రైవర్‌ను కార్యాలయ అవసరాలకు, నిబంధనల ప్రకారం అధికారిక విధులకు వినియోగించుకోవడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే వ్యక్తిగత అవసరాలకు సిబ్బందిని వినియోగించడం మాత్రం తీవ్ర అభ్యంతరకరమని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ




కార్యాలయ సిబ్బందితో వ్యక్తిగత వాహనం శుభ్రం చేయించుకోవడం, వ్యక్తిగత అవసరాల కోసం బయటకు పంపడం, ఇతర పనులు చేయించడం వంటి ఆరోపణలు నిజమైతే ఇది అధికారిక విధుల పరిధిలోకి ఎలా వస్తుందో అధికారులు సమాధానం చెప్పాలని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగి ఆదేశాలను ధిక్కరిస్తే ఇంక్రిమెంట్ నిలిపివేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై కూడా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**'అండ' చూసుకునే రెచ్చిపోతున్నారా..!**

సదరు ఎంపీహెచ్ఈఓకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అండదండలు ఉన్నాయనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో జరుగుతోంది. ఈ కారణంగానే ఆయన కార్యాలయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను అధికారులు స్పష్టంగా ఖండించాల్సి ఉంది. అధికారుల అండ ఉందా? లేక నిబంధనల ప్రకారమే డెప్యూటేషన్ జరిగిందా? అన్నది శాఖ ఉన్నతాధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. సదరు ఎంపీహెచ్ఈఓ గుల్లేపల్లిలో విధులు నిర్వహించాల్సి ఉండగా డీఎంహెచ్ఓ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై రావాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఆయన డెప్యూటేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? ఏ అవసరాల మేరకు ఆయన్ను కార్యాలయానికి తీసుకొచ్చారు? ఇక్కడ ఆయనకు కేటాయించిన అధికారిక బాధ్యతలేమిటి? అన్న అంశాలను బయటపెట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. అంతేకాకుండా డెప్యూటేషన్ వెనుక ఆర్థికపరమైన అక్రమాలకు అవకాశం కల్పించే అంశాలున్నాయన్న ఆరోపణలు కూడా ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, అధికారిక వివరాలు బయటకు రావాల్సి ఉంది.

**విచారణకు ఆదేశిస్తారా..!**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగుల విధుల నిర్వహణ, డెప్యూటేషన్లు, సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా డ్రైవర్‌ను బెదిరించి వ్యక్తిగత పనులకు వినియోగించారన్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజాసేవకు వేదికలు కావాలి తప్ప వ్యక్తిగత సేవలకు కేంద్రాలుగా మారకూడదని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. డెప్యూటేషన్ వెనుక అసలు కథ ఏమిటి? డ్రైవర్‌పై ఒత్తిడి తెచ్చి వ్యక్తిగత పనులు చేయించుకున్నారా? అధికారుల అండ ఉందా? అన్న ప్రశ్నలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంపై డీఎంహెచఓ అచ్యుతకుమారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. దీంతో ఎంపీహెచఈఓ డెప్యూటేషన్, డ్రైవర్‌ను వ్యక్తిగత పనులకు వినియోగించారన్న ఆరోపణలు, కార్యాలయంలో ఆయనకు కేటాయించిన విధులపై స్పష్టత లేకుండానే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.



## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సురవరపు సలోమికి ఘన సత్కారం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా అప్పుస్మా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఆ్రాఖూహీూ) ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నిడదవోలులోని నోబెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయురాలు సురవరపు సలోమిను విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ బోధనకు అందిస్తున్న సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడంలో సలోమి చేస్తున్న కృషికి ఈ సత్కారం దక్కింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నోబెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ చల్లా హరిబాబును కూడా ఘనంగా సత్కరించారు.



## హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా గణేష్ నిమజ్జనం

### భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు

### డిజె సౌండ్స్‌తో దద్దరిల్లిన దేవరాపల్లి

**దేవరాపల్లి, అక్టోబర్ 4, జయ జయహే**

మండల కేంద్రం దేవరాపల్లిలోని మొండి వీధి వద్ద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన వరసిద్ధి వినాయక ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆదివారంతో ముగిశాయి. ఈ మహోత్సవ సందర్భంగా నిర్వాహకులు ముగ్గుల పోటీలు, పిడతల పోటీలు, భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా భారీగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రెండు చోట్ల డాన్స్ బేబీ డాన్స్, మహిళల కోలాటం, దింసా నృత్యం, తప్పిడి గుళ్ళు, డీజే డాన్సులతో గ్రామమంతా కోలాహాలంగా మారింది.



## శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 04 జయ జయహే**

శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు, చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, పాలకమండలి సభ్యులు గురప్ప శెట్టి మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేసి దక్షిణామూర్తి సన్నిధి వద్ద వారికి వేదపండితులచే ఆశీర్వదించి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు .

# 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ నాన్-ట్రైబల్ వ్యక్తి అక్రమ నిర్మాణమా?

### నందివలసలో గుట్టుచప్పుడు కాకుండా షాపు నిర్మాణం..

### రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానాలు

**అరకులోయ , అక్టోబర్ 04: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలి మండలం మాదల పంచాయతీ పరిధిలోని నందివలస గ్రామంలో నాన్-ట్రైబల్ వ్యక్తి 1/70 చట్ట నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో "శ్రీ బాలాజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ప్లంబర్ అండ్ హార్డ్‌వేర్ షాప్" పేరుతో గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములను పరిరక్షించేందుకు అమల్లో ఉన్న 1/70 చట్ట నిబంధనలను పక్కనపెట్టి నాన్-ట్రైబల్ వ్యక్తి నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిర్మాణం జరుగుతున్న భూమికి






సంబంధించిన హక్కులు, రికార్డులు, అనుమతులు, నిర్మాణానికి చట్టబద్ధత ఉందా లేదా అనే అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ అరకు రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1/70 చట్టం పరిధిలోని భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయా అనే విషయాన్ని అధికారులు తక్షణమే పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్థలాన్ని పరిశీలించి, భూమి వివరాలు, యాజమాన్య హక్కులు, నిర్మాణ అనుమతులు, 1/70 చట్టం వర్తింపు తదితర అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అల్లూరి జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలి

**అరకులోయ, అక్టోబర్04: జయ జయహే.**



అల్లూరి సీతారామరాజు జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 889.8 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 739.5 మి.మీ. మాత్రమే నమోదైందని, దీంతో 16.9 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లాలోని 11 మండలాల్లో. 7 మండలాలు లోటు వర్షపాతం జాబితాలో ఉన్నప్పటికీ కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం విచారకరమన్నారు. వర్షాభావం కారణంగా జూన్, జూలై నెలల్లో వరి నాట్లు సక్రమంగా సాగలేదని తెలిపారు. కాఫీ, మిరియాలు, రాజ్మా, పసుపు, అల్లం, రాగిలు, కూరగాయల సాగుపై కూడా తీవ్ర ప్రభావం పడిందన్నారు. దీంతో గిరిజన రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన గిరిజన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని లేదా రీషెడ్యూల్ చేయాలని కోరారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచడంతో పాటు, తదుపరి సాగుకు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించి ప్రభుత్వం అండగా నిలవాలని శెట్టి అప్పాలు కోరారు. అల్లూరి జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి గిరిజన రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




## రాజమండ్రిలో జాతీయస్థాయి కార్డియాలజీ సదస్సు

**రాజమహేంద్రవరం జయ జయహే ప్రతినిధి :**

రాజమండ్రిలో తొలిసారిగా ఈ నెల 3, 4 తేదీల్లో జాతీయస్థాయి కార్డియాలజీ సదస్సు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ హైగ్రీవరావు, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎన్.ఎస్. రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మందికి పైగా వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణలో ఈసీజీ (ఎలక్ట్రో కార్డియోగ్రామ్) కీలక పాత్ర పోషిస్తుందని డాక్టర్ ఎన్.ఎస్. రామరాజు తెలిపారు. ఈసీజీ ప్రాధాన్యతపై యువ వైద్యులకు విస్తృతంగా బోధనలు, శిక్షణ, అవగాహన కల్పించడంతో పాటు గుండె జబ్బులను తొలిదశలోనే గుర్తించాల్సిన ఆవశ్యకతను వివరించడం సదస్సు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సోమరాజు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. గుండె వైద్య రంగంలో తాజా పరిజ్ఞానం, చికిత్సా విధానాలపై వైద్యులు పరస్పరం చర్చించారు.



## కలిగొట్లకు ఆర్ టి సి బస్సు

### సర్వీస్ పొడిగింపు

### ట్రయల్ రన్ లో పాల్గొన్న కూటమి నాయకులు

**దేవరాపల్లి, అక్టోబర్ 4, జయ జయహే**

విశాఖపట్నం నుంచి గవరవరం వరకు నడిచే ఆర్ టి సి బస్సు సర్వీసును కలిగొట్ల వరకు పొడిగించారు. ఈ సర్వీసును ఆర్టీసీ అధికారులు ఆదివారం కలిగొట్లలో ట్రయల్ రన్ నిర్వహించారు. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషితో ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం పట్ల స్థానిక కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్, మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్చార్జి పీవీజీ కుమార్, కూటమి నాయకులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, దొగ్గ దేముడు బాబు, బండారు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## నిడదవోలులో ప్లాస్టిక్ గ్లాసులపై అధికారుల కొరడా

### బార్‌లు, వైన్ షాపుల్లో ముమ్మర తనిఖీలు..దావీదు రాజు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



నిడదవోలు పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసుల విక్రయాలు, వినియోగంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో శానిటరీ సెక్రటరీలు ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు, సమీపంలోని కిల్లీ కొట్లలో ఆకస్మిక రైడ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు మాట్లాడుతూ.. పట్టణంలో చెత్త పెరిగిపోవడానికి ప్లాస్టిక్ గ్లాసులే ప్రధాన కారణమని, వీటిపై పూర్తి నిషేధం అమలులో ఉందని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ గ్లాసులు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# ఆంథోనీ స్కూల్లో గురువులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక





### 26ఏళ్ళ తర్వాత అపూర్వ కలయిక

**విశాఖపట్నం, అక్టోబర్ 4,:జయ జయహే**

సెయింట్ ఆంథోనీ పాఠశాలలో 1999--2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో 26 ఏళ్ల అనంతరం ఆత్మీయంగా కలుసుకున్నారు. విశాఖపట్నం పోలీసు బారెక్స్ సమీపంలోని పోలీసు కార్యక్రమాల మందిరంలో ఆదివారం ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు తమకు విద్యాబోధన చేసిన సుమారు 50 మంది గురువులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులను పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గురువులను ఒక్కొక్కరిని సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. గురువులు తమ పాత విద్యార్థులను కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరుగా మాట్లాడుతూ.. 26 ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల వల్లే తాము జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నామని తెలిపారు. తమలో పలువురు రెవెన్యూ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయం, పోలీసు శాఖ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, వివిధ ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా సేవలందిస్తున్నారని చెప్పారు. మరికొందరు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తుండగా, ఇంకొందరు వ్యాపార రంగంలో స్థిరపడ్డారని తెలిపారు.

తమకు కేవలం పాఠాలు మాత్రమే బోధించకుండా, జీవితంలో సరైన మార్గాన్ని చూపిన గురువుల సేవలను ఎప్పటికీ మరువలేమని పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. తమ మధ్య లేకుండా దివంగతులైన గురువులను ఈ సందర్భంగా ప్రేమతో స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియాదాస్ మాస్టారు, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలకు చెందిన పలువురు గురువులు పాల్గొన్నారు. ఇన్నేళ్ల అనంతరం తమను గుర్తు చేసుకుని ఆహ్వానించి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని గురువులు భావోద్వేగంతో తెలిపారు.

ఈ ఆత్మీయ కలయికను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన 2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు రామకృష్ణ, రియాజ్, దినకర్, గౌరీశంకర్, శివ, తనూజ్, ఉదయ్, వాసు పొట్నూరు తదితరులను గురువులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

**130 ఏళ్లకు పైగా ఘన చరిత్ర**

సెయింట్ ఆంథోనీ పాఠశాలకు 130 ఏళ్లకు పైగా ఘనమైన చరిత్ర ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. 1893లో స్థాపించబడిన ఈ విద్యాసంస్థకు బ్రిటిష్ పాలన కాలంలోనే 1923లో ప్రభుత్వ గుర్తింపు లభించిందన్నారు. విశాఖపట్నంలోని అత్యంత పురాతన విద్యాసంస్థల్లో సెయింట్ ఆంథోనీ పాఠశాల ఒకటని పేర్కొన్నారు. ఎందరో ప్రముఖ ఆచార్యులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, వైద్యులు ఈ పాఠశాలలోనే తమ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని సాగించారని గుర్తుచేశారు.

ఇలాంటి చారిత్రక నేపథ్యం కలిగిన విద్యాసంస్థలను ప్రభుత్వాలు ప్రత్యేకంగా గుర్తించి, వాటి అభివృద్ధికి తగిన ప్రోత్సాహం అందించాలని పూర్వ విద్యార్థులు కోరారు.

## జనసేనలో గిరిజనుల చేరిక

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 04, జయ జయహే**

శ్రీకాళహస్తి: జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై సుమారు 30 మంది గిరిజనులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. చందమామల కోటయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు జయప్రకాష్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పట్ల పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రత్యేక శ్రద్ధకు అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఆయన చూపుతున్న దృష్టి నిదర్శనమన్నారు. మారుమూల ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. జనసేన నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. కొత్తగా చేరిన వారు జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని, ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, మహేష్, పసుపులేటి నవీన్, ఢిల్లీ బాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.





## ఆకట్టుకున్న అమ్మాయిల వేద గానం

**మాడుగుల,అక్టోబర్ 4,జయ,జయ హే**

పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా సన్నిధిలో మాడుగుల అమ్మాయిలు ఆలపించిన వేదగానం భక్తుల్ని ఆకట్టుకుంది. ఈ నెల 3నుంచి 5వరకు పుట్టపర్తిలో అనకాపల్లి జిల్లా పర్తీ యాత్ర కార్యక్రమం జరుగుతుంది. జిల్లా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జిల్లా నుంచి సుమారు 4వేల మంది ఈ యాత్రలో పాల్గొనగా, మాడుగుల సమితి నుంచి సుమారు 60 మంది పర్తి యాత్రలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమంలో మందులకు చెందిన ఉగ్గిన వెంకట్రావు అమ్మాయి లు ప్రీతి, జ్యోతి, రాజుకొండ కుమార్తె కావ్య పుట్టపర్తి ప్రశాంతి నిలయం లో ఆలపించిన వేదం ఆకట్టుకొని ప్రశంసలు అందుకున్నారు. అలాగే పలువురు చిన్నారులు కూడా నృత్య ప్రదర్శనలు చేశారు. జిల్లా పర్తి యాత్రకు పెద్ద ఎత్తున భక్తులు రావడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా అధ్యక్షుడు అభినందించారు.

## జాతీయ మాల్ఖంబ్ క్రీడా పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా దక్షిణ క్షేత్రం

### అభినందించిన బీవీకే చైర్మన్ ఆచార్య గొలపల్లి నాగేశ్వరరావు

**విశాఖపట్నం, అక్టోబర్ 4, జయ జయహే**

విద్యా భారతి న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో విశాఖలోని భారతీయ విద్యా కేంద్రం జూనియర్ కళాశాల విశాలక్షి నగర్ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి మాల్ఖంబ్ క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి భారతీయ విద్యా కేంద్రం చైర్మన్ ఆచార్య గొలపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాభారతి, ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సభ్యురాలు ధరణిప్రియ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రోజుల పాటు దేశంలోని వివిధ క్షేత్రాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో "దక్షిణ క్షేత్రం ఓవరాల్ ఛాంపియన"గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే క్షేత్రాల వారీగా వర్గ ఛాంపియన్‌షిప్‌లను దక్షిణ క్షేత్రం 3, ఈస్ట్ యూపీ క్షేత్రం 2, మధ్య క్షేత్రం 2, దక్షిణ మధ్య క్షేత్రం 2 పతకాలు సాధించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. విజేతలైన విద్యార్థులు తదుపరి జాతీయ స్థాయి మాల్ఖంబ్ పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని క్షేత్ర విద్యార్థి సమయోజకులు కే.ఆర్.కే. సత్యనారాయణ తెలిపారు. విజేతలు తమ క్షేత్రాలకు గర్వకారణంగా నిలిచారని ఆయన అభినందించారు. ఈ ముగింపు కార్యక్రమంలో అఖిల భారతీయ ఖేల్ భారతి వైస్ చైర్మన్ రఘునాథ్ సాహూ, పోటీల సంయోజక సంజయ్ కుమార్ సూద్, సహా సంయోజక రామచంద్రన్‌తో పాటు బీవీకే సెక్రటరీ వీఆర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏవీఎస్ ఆచార్యులు, బోద నారాయణ రావు, రాజశేఖర్, డీఏవీ రమణమూర్తి, కళాశాల ప్రిన్సిపల్ సంయుక్త, పలువురు ప్రముఖులు, నిర్వాహకులు, క్రీడా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జాతీయ స్థాయిలో మాల్ఖంబ్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక బృందాన్ని భారతీయ విద్యా కేంద్రం చైర్మన్ ఆచార్య గొలపల్లి నాగేశ్వరరావు, వి.ఆర్. సచిన్ నాయన అభినందించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు విశాఖలో మాల్ఖంబ్ క్రీడా ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.







## ఉక్కు అధికారులకు టిఎన్‌టియుసి మద్దతు

**అగనంపూడి, అక్టోబర్ 4, జయ జయహే**

స్టీల్ ప్లాంట్ సమస్యలు పరిష్కారం కోసం ఉక్కు అధికారులు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 100 గంటల సి ప్రధాన కార్యదర్శి కే వి డి ప్రసాద్ మూడవ రోజు దీక్షకు టీఎన్‌టీయసీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం టీఎన్‌టీయసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విల్లా రామ్మోహన్ కుమార్, విశాఖ పార్లమెంటరీ టిఎన్టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ సెయిలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బిలీనం చేయాలని, బ్యాటరీ సిక్స్ నిర్మాణం చేపట్టాలని, ఐరన్ ఓరు పై టన్నుకు రూ 3 వేల సబ్సిడీ ఇవ్వాలని పెండింగ్ జీతాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, హైయర్ పెన్షన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న రిటైర్మెంట్ ఉద్యోగులకు ఇవ్వాలని కోరారు. మాజీ ఈడి టిపి రావు మాట్లాడుతూ సి అసోసియేషన్ తమ వ్యక్తిగత సమస్యల కంటే కర్మాగార పూర్వభవవృద్ధికి ప్రపంచ దేశాల్లో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రాముఖ్యతను పెంచడానికి చేస్తున్న వంద రోజుల దీక్షకు స్టీలు మంత్రిత్వ శాఖ చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. టిఎన్టియసి నాయకులు శీరంశెట్టి బాబ్జి, బి అప్పలరాజు యూజ్ ప్రధాన కార్యదర్శి కే పరందవయ్య సి అధ్యక్షులు వర్మ స్టీల్ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా సింహాచలం అభివృద్ధి: గంటా

**విశాఖపట్నం, అక్టోబర్ 4: (జయ జయహే)**



సింహాచలం దేవస్థానంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాల చేపట్టాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వెంకట్రావు కలిశారు. దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ట్రస్టు బోర్డులో ఆమోదించిన వివిధ ప్రతిపాదనలను తెలియజేశారు. సింహాచలం దేవస్థానం స్వచ్ఛ అవార్డు సాధించినందుకు ఈఓను గంటా అభినందించారు. సింహాద్రి అప్పన్న స్వామి వారి ప్రసాదాన్ని, పవిత్రాలను ఈఓ అందజేశారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

**19 ఏళ్లుగా అరకొర వేతనాలతో సేవలు**

**రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి.**

**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న డిమాండ్**

**దేవరాపల్లి, అక్టోబరు 4, జయ జయహే**



విబిజి రాం జి పథకంలో 19 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకం కింద వేలాది మంది కూలీలకు పనులు కల్పిస్తూ సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రస్తుతం కేవలం రూ.5,745 వేతనం మాత్రమే అందుతోందని వెంకన్న తెలిపారు. ఈ మొత్తం పని ప్రదేశాలకు వెళ్లి రావడానికి అయ్యే ప్రయాణ, పెట్రోలు ఖర్చులకే సరిపోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారం పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వేతనాలు పెంచడం లేదని పేర్కొన్నారు. రాజకీయ జోక్యంతో ఉద్యోగాల తొలగింపులు జరుగుతున్నాయని, దీంతో 19 ఏళ్లుగా సేవలందిస్తున్న సిబ్బందిలో అభద్రత నెలకొందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, అక్రమ తొలగింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నరేళ్లలో చట్టంలో మార్పులు, అదనపు బాధ్యతల కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారం మరింత పెరిగిందని వెంకన్న పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. వెంటనే కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



## కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేస్తాం

**మాడుగుల అక్టోబర్ 4 జయజయ హే**

మాడుగుల మోదమాంబ కాలనీలో అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపం ఎమ్మెల్యే బండరు సత్యనారాయణమూర్తి సహకారంతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని మాడుగుల పట్టణ టిడిపి అధ్యక్షుడు పూప్పాల లక్ష్మీనారాయణ చెప్పారు. ఆదివారం ఆయన నిర్మాణం లో నిలిచిపోయిన మోదమాంబ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సమస్యను మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాము శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కొలెస్ట్రాల్ సమస్య

## ఒక్క స్పూన్ నూనెతో ఇలా వండేయండి..

## ఆరోగ్యంతో పాటు రుచి కూడా

నూనె మసాలాలతో కూడిన ఆహారాన్ని ఎంత ఎక్కువగా తీసుకుంటే కొలెస్ట్రాల్-మధుమేహం సమస్యలు అంతగా త్వరగా పెరుగుతాయి. వీలైనంత వరకు వేపుడు పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. ట్రైగ్లిజరైడ్స్ లేదా కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ సమస్యలు, ఊబకాయం ఉన్నవారు నూనె అస్సలు తినకూడదు. అలాగని.. ఒక్క చుక్క నూనెతో వంట చేయడం సాధ్యం కాదు. అయితే, వంటలో నూనె మొత్తాన్ని తగ్గించి వంట చేసుకోవచ్చు. అంటే 5 స్పూన్లకు బదులుగా 1 చెంచా ఉపయోగించవచ్చు. వంటల్లో నూనె వాడకాన్ని ఎలా తగ్గించాలో ఇక్కడ తెలుసుకుందాం..

నాన్ స్టిక్ పాన్ కొద్దిగా నూనెతో బాగా ఉడుకుతుంది. నాన్ స్టిక్ పాన్ లో కొద్దిగా నూనె రాస్తే త్వరగా ఉడికిపోతుంది. నూనె పాత్ర నుంచి నేరుగా పాన్ లోకి నూనె పోయవద్దు. ఒక చెంచా లేదా కొలిచే కప్పు ఉపయోగించాలి. నూనె పేస్ట్ కూడా ఉపయోగించవచ్చు.

వేయించిన ఆహారాన్ని ఎంత తక్కువ తింటే అంత ఎక్కువగా నూనె శరీరంలోకి చేరుతుంది. బదులుగా కాల్చిన ఆహారాలు తినడానికి ప్రయత్నించండి. నూనె పూసిన చేపలు, మాంసాన్ని కాల్చిన తర్వాత ఆహారంగా తీసుకోవచ్చు.మంటపై కాల్చకపోయినా, ఆవిరిపై కూడా వండుకోవచ్చు. ఇందుకు తక్కువ నూనె సరిపోతుంది. సుగంధ ద్రవ్యాలతో చేపలు, మాంసం, గుడ్లు ఆవిరి మీద ఉడికించి రుచిగా తినవచ్చు.

పాన్‌లో ఆయిల్ వేసి విడిగా ఉడికించాల్సిన అవసరం లేదు. చేపలు, మాంసం లేదా ఇతర కూరగాయలను పులుసు మాదిరి కలిపి సన్నని మంటపై ఉడికించినా సరిపోతుంది. అన్నంలో రుచిగా ఉంటుంది.

## వర్కౌట్స్ రెగ్యులర్‌గా చేస్తే

# మెరిసే స్కిన్ మీ సొంతం

**స్కిన్ మెరవడానికి చాలా మంది చాలా ట్రై చేస్తుంటారు. అయితే, హెల్దీ లైఫ్‌స్టైల్ కారణంగానే స్కిన్ అందంగా మెరుస్తుంది. దీంతోపాటు స్కిన్ రొటీన్ ఫాలో అవ్వాలి. దీంతో పాటు కొన్ని ఎక్సర్‌సైజెస్ కూడా హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. ఎక్సర్‌సైజెస్ ఆరోగ్యానికి ఎంత మంచివో.. శరీరానికి కూడా అంతే మంచివి. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల చెమట వస్తుంది. దీంతో స్కిన్ క్లియర్ అవుతుంది. స్కిన్ మెరుస్తుంది కూడా. మరి ఏ ఎక్సర్‌సైజెస్ చేస్తే స్కిన్‌కి మంచిది. స్కిన్ అందంగా మెరుస్తుందో పూర్తి వివరాలు తెలుసుకోండి.**



### ఫేషియల్ యోగా..

ఫేషియల్ యోగా కూడా స్కిన్ గ్లోయింగ్‌కి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల ఎలాంటి బొటాక్స్, సర్జరీ చేయకుండానే స్కిన్ లిఫ్ట్ అవుతుంది. దీని వల్ల ఫేషియల్ మజిల్స్ టోన్ అవుతాయి. దీనిని రెగ్యులర్‌గా చేస్తే స్కిన్ టోన్ అవుతుంది. ఫేషియల్ యోగాలో స్కిన్ గ్లో అవ్వడానికి ఫిష్ లిప్స్, కిస్ ఫేస్, విజిల్స్ వంటి ఫేషియల్ యోగా వర్కౌట్స్ చేయొచ్చు. దీని వల్ల స్కిన్ గ్లో అవుతుంది.

### వెయిట్ ట్రైనింగ్..

మీరు గనుక జిమ్‌లో అయినా, ఇంట్లో అయినా వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేస్తే అది మీ బాడీకి, స్కిన్‌కి చాలా హెల్ప్ చేస్తాయి. ఏ వెయిట్ ట్రైనింగ్ అయినా మజిల్స్‌ని టోన్ చేస్తాయి. స్కిన్ అందంగా మెరుస్తుంది. దీని వల్ల మజిల్స్ టైట్ అవుతాయి. స్కిన్ యంగ్‌గా కనిపించేలా చేస్తుంది. దీనికోసం వారంలో రెండు, సార్లు వెయిట్ ట్రైనింగ్ వర్కౌట్స్ చేయొచ్చు.



### ఏరోబిక్స్..

స్కిన్ కోసం కేవలం హై ఇంటెన్సిటీ వర్కౌట్స్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. ఏరోబిక్స్ కూడా హెల్ప్ చేస్తాయి. ఏరోబిక్స్ కారణంగా స్కిన్ క్లియర్ అవుతుంది. కొల్లాజెన్ ప్రొడక్షన్ పెరుగుతుంది. కొల్లాజెన్ కారణంగా చర్మంలో సాగే గుణం పెరుగుతుంది. దీని వల్ల ముడతలు తగ్గుతాయి. స్కిన్ అందంగా కనిపిస్తుంది.

### స్విమ్మింగ్..

స్విమ్మింగ్ పూల్‌లో క్లోరైన్ ఉంటుంది. ఇది ఒక్కొక్కరి స్కిన్‌పై ఒక్కో ఎఫెక్ట్‌ని చూపిస్తుంది. క్లోరైన్‌లో కొన్ని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. అవి బ్రేక్ అవుట్స్ కాకుండా హెల్ప్ చేస్తాయి. కేవలం స్కిన్‌కి మాత్రమే కాదు. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. దీంతో పాటు స్కిన్ టోన్ కూడా ఇంప్రూవ్ అవుతుంది.

### రన్నింగ్..

రన్నింగ్ చేయడం వల్ల చెమట ఎక్కువగా వస్తుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. దీని వల్ల దుమ్ము, ఆయిల్ అన్నీ కూడా బయటికి వస్తాయి. దీని వల్ల స్కిన్‌కి మంచి లుక్ వస్తుంది. రన్నింగ్ చేయడానికి మీరు జిమ్‌కి వెళ్ళడం, ట్రెడ్‌మిల్ కూడా వాడాల్సిన అవసరం లేదు. మీరు ఖాళీ ప్లేస్‌లో రన్నింగ్ చేయొచ్చు. దీని వల్ల బ్లడ్ పంప్ అవుతుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. అయితే, బయట రన్ చేసేటప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు.

### వీటితో పాటు..

కాస్లీసీరమ్, స్క్రబ్స్ బదులు నేచురల్ స్కిన్‌కేర్ చాలా మంచిది. బ్యాలెన్స్, హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడం వల్ల స్కిన్ హెల్దీగా కనిపిస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల కూడా స్కిన్ నేచురల్‌గా గ్లో అవుతుంది. జిమ్ చేయడం, వర్కౌట్స్ చేసేటప్పుడు డియోడ్రెంట్ వంటి ప్రోడక్ట్స్‌ని మర్చిపోవద్దు.

# నోట్లో వేసుకుంటే కరిగిపోయే పైన్ నట్స్



## ఎన్నో వ్యాధులకు దివ్యౌషధం

అనేక పోషకాలున్న పైన్ నట్స్ ధర మాత్రం చాలా ఎక్కువ. కిలోకు దాదాపుగా 8000 రూపాయల దాకా ఉంటుంది. అంటే ఓ గ్రాము బంగారంతో సమానం. పైన్ గింజలు తినడానికి చాలా రుచికరమైనవి. పోషకమైనవి. ఇది మనల్ని అనేక వ్యాధుల నుండి రక్షించే దివ్యౌషధం.

మనకు అందుబాటులో ఉన్న అనేక డ్రైఫ్రూట్స్‌లలో రుచికరమైనవి అంటే..జీడిపప్పు, బాదాం, పిస్తాలే కాదు.. అంతకుమించిన మధురమైన రుచి ఈ పైన్ నట్స్‌కు ఉంటుంది. తినడానికి క్రీమీగా, నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. ఏదో మంచి స్వీట్ తిన్న అనుభూతి వస్తుంది.

పైన్‌నట్స్‌లో అధిక శాతం అసంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ ఇ, ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి అనేక ఇతర పోషకాలు పైన్ గింజలలో ఉన్నాయి. పైన్ గింజలలో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఎముకలు దృఢంగా ఉంచుతుంది.

వీటిని తినడం వల్ల కొవ్వులున్న జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలని ప్రయత్నించేవారు చిల్గోజా తినడం అలవాటు చేసుకోవాలి. అనారోగ్యకర ఆహారాలు తినాలనే కోరిక తగ్గించడంతో పాటూ బరువు తగ్గడంలోనూ ఇది సాయపడుతుంది. అంతేకాదు..చిల్గోజాలో ఒమేగా 6, సెలీనియం ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తుంది. క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది.

చిల్గోజాలో జింక్ పుష్కలంగా ఉంటుంది. ఇది సంతానలేమి వంటి సమస్యను తొలగించడానికి సహాయపడుతుంది. చిల్గోజా సాధారణ జలుబు నుండి రక్షించడానికి కూడా సహాయపడుతుంది. జింక్ పరిమాణం గాయం వేగంగా నయం చేయడానికి సహాయపడుతుంది.

పైన్ గింజల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువవ్వడం వల్ల డయాబెటిస్ లో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల ఇన్సులిన్ పనితీరు పెరుగుతుంది. చిల్గోజా తినడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. డిప్రెషన్, చిరాకు, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఆహారంలో చిల్గోజా చేర్చుకోవాలి. మెగ్నీషియం మోతాదు ఈ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే రాత్రిపూట చిల్గోజా తింటే కండరాలు రిలాక్స్ అవుతాయి.

For a pure tomorrow.. జయహే

# ప్రేమకు విషాద ముగింపు

(ప్రతాప్)



విజయవాడ: కలిసి జీవితం నిర్మించుకోవాలని భావించిన ఇద్దరు యువతీయువకుల ప్రేమ వ్యవహారం చివరకు విషాదాంతమైంది. విజయవాడ న్యూ రాజరాజేశ్వరీపేటలో శనివారం జరిగిన ఘటనలో 19 ఏళ్ల మహాలక్ష్మి ప్రాణాలు కోల్పోగా, ఆమెపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 22 ఏళ్ల చిన్నారావు అనంతరం సమీప భవనం పై నుంచి దూకి మృతి చెందాడు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన చిన్నారావు పెయింటింగ్, ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. పనుల నిమిత్తం తరచూ విజయవాడకు వచ్చి తన అన్నయ్య వద్ద ఉండేవాడు. ఈ క్రమంలో న్యూ రాజరాజేశ్వరీపేటలో నాయనమ్మతో నివసిస్తూ దుస్తుల దుకాణంలో పనిచేస్తున్న మహాలక్ష్మితో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారినట్లు తెలుస్తోంది.




ఇద్దరూ వివాహం చేసుకోవాలని భావించినప్పటికీ కుటుంబాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు పోలీసులు చెబుతున్నారు. పెళ్లి విషయంలో విభేదాలు పెరగడంతో మహాలక్ష్మి చిన్నారావుకు దూరంగా ఉంటున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కుటుంబ పెద్దల సమక్షంలో ఈ వ్యవహారంపై చర్చ జరిగినట్లు కూడా సమాచారం.

శనివారం ఉదయం చిన్నారావు మహాలక్ష్మి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వివాహం, సంబంధం కొనసాగింపు విషయాలపై వాగ్వాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో చిన్నారావు పదునైన ఆయుధంతో మహాలక్ష్మిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమె మెడ సహా పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి.

రక్తస్రావంతో పడిపోయిన మహాలక్ష్మిని కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

దాడి అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన చిన్నారావు సమీపంలోని భవనం పైకి ఎక్కి కిందకు దూకినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గతంలో ఈ వ్యవహారంపై పోలీసులకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని అధికారులు స్పష్టం చేశారు.

ప్రేమ సంబంధం, వివాహ ప్రతిపాదనపై అభ్యంతరాలు, కుటుంబాల మధ్య జరిగిన చర్చలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలు తదితర అంశాలను పోలీసులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ఒకే ఘటనలో ఇద్దరు యువజీవితాలు ముగియడంతో న్యూ రాజరాజేశ్వరీపేటలో తీవ్ర విషాదం నెలకొంది.

(మీడియా వార్తల ఆధారంగా)



## 36వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

విశాఖపట్నం జయ జయహే

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 36వ వార్డులో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని 36వ వార్డు అధ్యక్షులు ఎండీ ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా వార్డు స్థాయిలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు బాబ్జి, 36వ వార్డు కార్యకర్తలు వెంకటి రమణ, కమల్, కాసు బాబు, ధనరాజు, చేపల అప్పారావు, తాతారావు, సత్య, రవి, అప్పలరాజు, ప్రసాద్, ఇబ్రహీం, సిలార్, సలీం, మామ అది లక్ష్మి, మాధురి దేవి, నూకరత్నం, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీరు పోక దారి లేక పట్టణ పురవీధుల్లో నిత్యం దుర్వాసన

### మురికి కాలువల పునరుద్ధరణ జరగాలి

టెక్కలి అక్టోబర్ 4 జయ జయహే

శ్రీకాకుళం జిల్లా లోని రెండవ జిల్లాగా పేరున్న డివిజన్ ప్రధాన కేంద్రం, నియోజక వర్గమై న టెక్కలి సుందరీకరణ జరుగుతున్న వేళ వీధులు వాన నీరు, మురుగునీరు వెళ్లే మార్గము లేక రహదారుల్లో ప్రవహించడం నిత్యం పాదచారులకు దుర్గంధం దుర్వాసనలు తప్పడం లేదు, గతంలో మురుగు నీరు వెళ్లే మార్గం నిర్మాణ పనులు సరిగ్గా నాణ్యతగా జరగకపోవడమే ఇందుకు కారణమని పలువురు స్థానికులు వాపోతున్నారు. టెక్కలి వీధుల్లోనీ ఎన్టీఆర్ నగర్, చిన్న బజారు, రామదాసు పేట, లోతట్టు వీధులు వర్షం వస్తే నగరంలోనీ కోనేరులు చెరువులు నిండి మురుగునీటి ప్రవాహాలు ప్రవాహలతో నడకదారులు స్థానికులకు నరకతుల్యం అవుతున్నాయి, నగరం సుందరీకరణలో భాగంగా మురుగు కాలువలు ప్రవహించే ప్రక్రియకు సంబంధిత అధికారులు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి పుర రజనుల కు రహదారుల సౌకర్యం, సమగ్ర ఆరోగ్యానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించగలరని టెక్కలి వాస్తవ్యులు కోరుతున్నారు.





## జర్నలిజంలో మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలి

తిరుపతి, అక్టోబరు 4, జయ జయహే

తిరుపతి జర్నలిజంలో వస్తున్న మార్పులను స్వీకరించి, అందుకు అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ సూచించారు. సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుపతి జిల్లా గ్రామీణ విలేఖరుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లు, మీడియా అకాడమీ ప్రచురించిన పుస్తకాలను అందజేశారు. సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ వార్తకు ప్రజా ప్రయోజనమే ప్రధాన ప్రాతిపదిక కావాలని అన్నారు. జర్నలిస్టులు వార్తల ద్వారా ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించాలని సూచించారు. శిక్షణలో సీనియర్ జర్నలిస్టులు ఎ. రాఘవ శర్మ, శ్రీశైలం రమేష్, నరేష్ నందం, డి. సోమసుందర్ తదితరులు తెలుగు భాష, క్రైమ్ రిపోర్టింగ్, ఫ్యాక్ట్ చెకింగ్, గ్రామీణ వార్తలు--కథనాలు తదితర అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఘనంగా సీతంపేటలో అమ్మవార్ల జాతర మహోత్సవం

దేవరాపల్లి, అక్టోబర్ 4, జయ జయహే

మండలంలోని సీతంపేట గ్రామంలో ఆదివారం భులోకమ్మ అమ్మ వారి, పసలమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం డప్పులు, మేళా తాళాలు డీజేల నడుమ జాతరను నిర్వహించారు. ఈ అమ్మవార్ల జాతరలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## సమయానికి ఎందుకింత తొందర

### మన కళ్లకి వెలుగు రేఖలు దిద్దే సమయానికి ఎందుకు అంత తొందరో....

**తూరుపున తొంగి చూసే తొలి కిరణం వెలుగు కోసం ఆరాటమా, మంచు తుంపరలపై మెరిసే బాలరవితో ఆడుకోవాలని అనుకున్నదో.... గుండెలకు హత్తుకొని లాలించాలని ఈ పరుగు కాబోలు. బాల భానుడిని ఎత్తుకొని అమ్మ వలె తన బిడ్డలను చైతన్యవంతులుగా చేసి, ఉత్సాహంగా తనతో ఉరుకులు వెయ్యాలని ఆశ పడుతుందని అనుకుందామా!**

సమయం తన వంపు సొంపులు, వయ్యారాలను ఒలికిస్తూ... మండుటెండలో మండే మార్తాండుడు కోసమా... నడిరేడు నిప్పులు చిమ్మే వేళ వలపు పాఠాలు ఎలా చెబుతుందో.... నింగి గుండెల్లో నిప్పై మండే వాడిని వలచింది అంటే ఏంటో, ఆ సంబరం నడినెత్తిన నిప్పుల కుండను మోస్తూ తిరుగుతుంది వయ్యారంగా, అంటే సర్వ మానవాళికి జీవనోపాధి కై సమయం చేతులు చాచి మండే సూర్యుడిని కౌగిలించుకునే త్యాగమూర్తి అనుకుందామా!

ఈ సమయం చాలా సొగసరి, తన సోయగాల అందంతో అలసిన రవిని, పడమటి కొండపై పవళించే సూర్యుడిని నిద్రలేపి, సందె వెలుగులో సింధూరమై కరిగిన సింధూరపు సూర్యుడిని తన నుదుట తిలకంగా దిద్దుకొని, అస్తమయ భానుడిని విరహ వేదనతో వీడ్కోలు తెలుపుతుంది ఎందుకనో....

**సమస్త జీవరాశులకు విశ్రాంతి కోసం అనుకుందామా!**

సంధ్యారవిని సాగనంపిన సమయం అలసి విశ్రాంతి తీసుకుంటుందా...

సాయం సంధ్యా సమయంలో పిల్లగాలులతో సయ్యాటలు ఆడుతుంది...

సమయం ఎంత గడుసరి, సూర్యుడికి వీడ్కోలు తెలిపి, చంద్రుడి కై ముస్తాబై, నక్షత్ర వెలుగులో ఎదురు చూస్తుంది, చంద్రుడు ఈమె అందం కోసం వెన్నెల వర్షం కురిపిస్తాడని ఏమో....

వెన్నెల్లో ఆటపాటలు అయ్యాక, జోల పాటలు పాడుతూ సకల జీవరాశులకు విశ్రాంతి కోసం జాబిల్లితో జత కడుతుందని అనుకుందామా!

అయినా ఈ సమయానికి విశ్రాంతి ఉండదు, నవ్వుతూ అలుపెరుగని పోరాటంలో సూర్య, చంద్రులతో ఆడుతూ సాగుతుంది మన కోసమే అనుకుందామా!

కలం : వసంత కోకిల
రచన : డా. జి. మాలతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు
డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల,
విశాఖపట్నం



9490824860

## జనసేనలో సత్రవాడ ప్రవీణ్‌కు ఘన సన్మానం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 04, జయ జయహే

శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన సత్రవాడ ప్రవీణ్‌ను పాత వీరాపురం జనసైనికులు ఘనంగా సన్మానించారు. పానగల్‌లోని సత్రవాడ ప్రవీణ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ జనసేన పార్టీకి, సత్రవాడ ప్రవీణ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహాయ సహకారాలతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని జనసైనికులు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటముని, నాగరాజు, ఉదయ్, మోతి, రామలింగారెడ్డి, భరత్, ముని తదితర జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com